సాక్షి శ్రీకాకుళం
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



తుది సమరానికి సిద్ధం

ఎస్‌పీఎల్ చివరి అంకానికి చేరుకుంది. నేడు ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

- 8లో



సకాలంలో గుర్తిస్తే..

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నిరోధించవచ్చని డాక్టర్లు అంటున్నారు. నేడు వరల్డ్ క్యాన్సర్ డే.

- 8లో

వత్సవలస యాత్రకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: గార మండలం వత్సవలస జాతరకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 10 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు శనివారం ఉదయం 7గంటల నుంచే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని, అలాగే ఆదివారం కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జాతరకు వెళ్లే భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

జాతీయ జూడో పోటీల్లో సౌమ్యకు బంగారం



కె.సౌమ్యరాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో సిక్కోలు జూడో యువ సంచలనం కడపల సౌమ్యరాణి సంచలనం సృష్టించింది. కేరళలోని త్రిసూరా వేదికగా జరుగుతున్న 2వ ఖేలో ఇండియా జాతీయ మహిళల సౌత్‌జోన్ లీగ్/ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన సౌమ్యరాణి బంగారు పతకంతో మెరిసింది. ఈ పోటీలు ఈనెల 3వ తేదీన మొదలయ్యాయి. 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్న సౌమ్యరాణి మరోసారి ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా పోటీల్లో పతకం సాధించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈమె ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో ఉన్న వరం నగరపాలక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. డీఎస్‌ఏ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది.

న్యాయ కళాశాల వర్చువల్ తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలను బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వర్చువల్‌గా శుక్రవారం తనిఖీ చేసింది. కమిటీ అడిగిన అంశాలను నెట్‌లో వర్సిటీ అధికారులు అప్‌లోడ్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో రూ. 8.50 లక్షలు చెల్లించారు. బీసీఐ కమిటీ జాప్యం, గుర్తింపు మంజూరు చేయకంపోవటం వల్ల లాసెట్ - 22 ప్రవేశాలు నిలిచిపోయాయి. రెండు విడతలు కౌన్సెలింగ్‌లో సైతం ప్రవేశాలు జరగ లేదు. దీంతో ఉన్నత విద్యా శాఖ, ఉన్నత విద్యా మండలి సమస్యలు బీసీఐ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో బీసీఐ సభ్యులు వర్చువల్‌లో పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. బీసీఐ గుర్తింపు మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామని, వచ్చిన వెంటనే తక్షణ ప్రవేశాలు ఉన్నత విద్యా మండలి అనుమతులతో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఇక నాలుగేళ్ల డిగ్రీ కోర్సు: వీసీ



నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం కోర్సు) ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ వీసీ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో 2030 తర్వాత బీఎడ్, డీఎడ్ కోర్సుల నిర్వహణ ఉండదని తెలిపారు. నాలుగేళ్ల ఐటీఈపీ కోర్సుల నిర్వహణ ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌సీటీఈ (అఖిల భారత ఉపాధ్యాయ మండలి) అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. డిగ్రీతోపాటు బీఎడ్, డీఎడ్ ఈ కోర్సుతో లభిస్తుందని అన్నారు. సెకెండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ రెండు పోస్టులకు అర్హత లభిస్తుందని అన్నారు. ప్రస్తుతం వర్సిటీలో బీఎస్సీ ఐటీఈపీలో ఎంపీసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఏలో ఐటీఈపీ కోర్సులో చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్టులు నిర్వహిస్తామన్నారు. అఖిల భారత ఉపాధ్యాయ మండలి సూచనల మేరకు కోర్సు డిజైన్ చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో మొదటి ఐటీఈపీ కోర్సు ప్రారంభిస్తున్న విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అని తెలిపారు.

అదనపు షిఫ్ట్.. ఆర్తులకు గిఫ్ట్





నాలుగో షిఫ్ట్‌తో కొత్తగా సేవలు పొందుతున్న కిడ్నీ వ్యాధి బాధితులు

- పలాస డయాలసిస్ కేంద్రంలో నాలుగో షిఫ్ట్ ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న కిడ్నీ వ్యాధి బాధితులు

కాశీబుగ్గ: కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ తరచుగా డయాలసిస్‌కు వెళ్తున్న వారి కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. బాధితులకు మరిన్ని అదనపు సేవలు అందించాలనే ఉద్దేశంతో డయాలసిస్ కేంద్రంలో సేవలను పెంచుతోంది. తొలుత పలాస డయాలసిస్ కేంద్రంలో మూడు షిఫ్టులు నుంచి నాలుగు షిఫ్టులకు సేవలను పెంచుతున్నారు. ఇక్కడ విజయవంతమైతే అన్ని కేంద్రాల్లోనూ ఈ పద్ధతి అమలు చేయనున్నారు.

- ప్రస్తుతం జిల్లాలో వెయ్యిమంది వరకు కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుతున్నాయి. నాలుగో షిఫ్ట్ సేవలు ప్రారంభమైతే నెలకు సుమారు 2700 అదనపు డయాలసిస్ సేవలు అందుతాయి.

అత్యవసర మందులు కూడా..

వీరికి ప్రస్తుతానికి ప్రభుత్వం తరఫున ఉచిత డయాలసిస్‌తో పాటుగా ఇంజెక్షన్లు, మాత్రలు అందిస్తున్నారు. పెంటాప్, డోలో, ఎవిల్ మాత్రలు, ఎరిత్రోపాయిటిన్, ఐరెన్ ఇంజెక్షన్లు, డియోలన్ లిక్విడ్, టెక్స్‌టోజ్, ఆఫ్‌లీన్ వంటి ఉచిత మందులు అందిస్తున్నారు. ఇవి కాకుండా అత్యవసరమైన మందులను కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నారు.

- జిల్లాలో ఉన్న ఆరు డయాలసిస్ కేంద్రాల్లో ప్రస్తుతం మూడు షిఫ్టుల్లో సేవలు అందుతున్నాయి.
- పలాస డయాలసిస్ కేంద్రంలో ప్రయోగాత్మకంగా నాలుగో షిఫ్ట్ సేవలు పెంచుతున్నారు.
- శుక్రవారం నుంచి నాలుగు షిఫ్ట్ సేవలు ప్రారంభించారు.
- సాధారణంగా.. రోజూ ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభించి రాత్రి ఎనిమిది గంటలకు పూర్తయ్యే ప్రక్రియ అదనపు షిఫ్ట్ కలుపుకుని వేకువజామున 5.30 గంటల నుంచి రాత్రి పదిగంటల వరకు కొనసాగనుంది.
- ఒక్కో షిఫ్ట్‌లో 15 మందికి డయాలసిస్ చేస్తారు.
- నెలకు 450 డయాలసిస్ సేవలు అదనంగా అందుతాయి.

నాలుగో షిఫ్ట్‌తో పేదవారికి అవకాశం



నాలుగో షిఫ్ట్ ఏర్పాటు చేయడంతో చాలా మంది పేద రోగులకు ఉపయోగపడుతుంది. డయాలసిస్ కేంద్రంలో కొత్త రోగులకు అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు కొత్త షిఫ్ట్ ఏర్పాటుతో ప్రాంతీయంగా ఉన్న వారికి చక్కని అవకాశంగా భావిస్తున్నాం. నా వయసు 45 ఏళ్లు. రెండు కిడ్నీలకు వ్యాధి సోకింది. నాకు రూ.10 వేల ఫించన్ అందుతుంది. నాలుగేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఇప్పుడేమో రోజు తప్పించి రోజు డయాలసిస్ జరిపించుకుంటున్నాం. నాలుగో షిఫ్ట్ ఏర్పాటుతో మాకు ఎంతో మేలు.

– మురపల్లి ధనలక్ష్మి, పల్లిసారది గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం

సమస్యలు తొలగిపోతాయి



పలాస డయాలసిస్ కేంద్రంలో ఇప్పటి వరకు మూడు షిఫ్టులు ఉండేవి. అక్కడ అవకాశం లేని వారు బోలెడు డబ్బు ఖర్చు చేసి విశాఖ వెళ్లాల్సి వచ్చేది. ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులు ఇటీవల పర్యటనలో భాగంగా ఇక్కడ సమస్యను గుర్తించారు. అధికంగా రోగులు డిమాండ్ ఉన్న చోట షిఫ్టులు పెంచాలని ఆదేశించారు. దీంతో తొలుత పలాస డయాలసిస్ కేంద్రంలో ప్ర యోగం చేస్తున్నాం. ఇక్కడ విజయవంతం అయి తే ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి షిఫ్టులు పెంచనున్నారు. డయాలసిస్‌తో పాటు మందులు, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు, నెఫ్రాలజిస్టుతో తనిఖీలు చేయిస్తున్నాం.

– ఇప్పిలి ప్రసాదరావు, సెంట్రల్ మేనేజర్, పలాస, డయాలసిస్ కేంద్రం

జిల్లాలో ఇలా..

కిడ్నీ రోగులు :	20,000 వివిధ స్థాయిలు
సీహెచ్‌సీలు:	15 (సామాజిక ఆస్పత్రులు)
పీహెచ్‌సీలు :	83 (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)



ఉచిత మందులు, ఇంజెక్షన్లు

ప్రాంతీయ ఆస్పత్రులు	: 02	కిడ్నీ ప్రభావిత గ్రామాలు	: 187
జిల్లా కేంద్ర ఆస్పత్రి	: 01	సేవలు పొందుతున్నవారు	: 1000
బోధన ఆసుపత్రి	: 01	నాలుగో షిఫ్ట్ ప్రారంభమైతే కొత్తగా డయాలసిస్ సేవలు (నెలకు) : 2700	
డయాలసిస్ కేంద్రాలు	: 06		
కిడ్నీ ప్రభావిత మండలాలు	: 07		
నియోజకవర్గాలు	: 02		



కల సామాన్యుడిది.. సాకారం ప్రభుత్వానిది



చెక్కును సింధూజ తల్లిదండ్రులకు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తదితరులు

- విదేశాల్లో ఉన్నత విద్యకు ప్రభుత్వ సాయం
- జగనన్న విదేశీ విద్యాదీవెనతో అండ
- జిల్లాలో మొదటి విడతగా రూ.35 లక్షలు పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: విదేశాల్లో చదవాలనుకునే సామాన్యుల కలలు నెరవేర్చడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 213 మంది విద్యార్థులకు రూ.19.95 కోట్లను శుక్రవారం జమ చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఒకరికి రూ.35 లక్షలు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం తొలి విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. బటన్ నొక్కి 213 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.19.95 కోట్లను జమచేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు విదేశాల్లో గల టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా ఇతర కోర్సుల్లో చదివేవారికి వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో ఐదుగురిని అర్హులుగా ఎంపిక చేసి, అందులో ఒకరైన సింధూజకు మొదటి విడతగా రూ.35 లక్షలు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులంతా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూలో ఎంఎస్ (ఈసిఈ) విద్యను అభ్యసిస్తున్న చదువుల సింధూజ తల్లితండ్రులు రమేష్ బాబు దంపతులకు రూ.35,18,152ల నమూనా చెక్కును అందించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.అనూరాధ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రపతి తదితరులు పాల్గొన్నారు.

అల్విదా.. రూనీ్సీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో శిక్షణ.. పేలుడు పదార్థాల వెలికితీతలో అద్భుత నైపుణ్యం, వీఐపీల భద్రతలో అపార సేవ.. కలగలిపి రూనీ్సీ. పోలీసుల డాగ్ స్క్వాడ్‌లో కీలకమైన జాగిలం రూనీ్సీ (10) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. లాబ్రడార్ జాతికి చెందిన ఈ శునకం హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందింది. వయో భారంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి అధికారులు విశ్రాంతి ఇచ్చారు.



రూనీ్సీకి పోలీసుల గౌరవ నివాళి

విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ వంటి ప్రాంతాల్లో నిర్వహించిన పోలీస్ మీట్‌ల్లో ప్రతిభ కనపర్చి, అవార్డులు సాధించింది. జాగిలం మృతికి ఎస్పీ రాధిక, ఏఎస్పీ విఠలేశ్వరరావు నివాళులు అర్పించారు.

అయిన వాడే అందరికీ..

- కళాతపస్వి మహాభినిష్క్రమణంతో సిక్కోలులో శోకం
- జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటున్న జిల్లా వాసులు



చుక్కల్లారా.. చూపుల్లారా ఎక్కడమ్మా జాబిలి..? అన్న వెండితెర ప్రశ్నకు సమాధానం విశ్వనాథుడు. నరుడి బతుకు నటన.. ఈశ్వరుడి తలపు ఘటన.. ఆ రెండి నట్టనడుమ అర్థవంతమైన కథలను అల్లి తెలుగు సినిమాకు ముద్దలు కలిపి తినిపించిన పెద్దాయన కాశీనాథుని విశ్వనాథ్. క్షార జలధులే.. క్షీరములైన వేళ ఆ మథనంలో మెరిసిన స్వాతిముత్యం ఈ అచ్చ తెలుగు దిగ్దర్శకుడు. కళకు, కళాకారుడికి అంతం లేదని చెప్పి 92 ఏళ్ల వయసులో శివుడిలో ఐక్యమైపోయారు. ఈ ఎడబాటు కేవలం భౌతికమే.. చెప్పులు కుట్టుకునే సాంబయ్య, పక్కవాడి కష్టంలో పాలు పంచుకునే శివయ్య, మత్తులోనూ నాట్యం గురించి మర్చిపోని బాలకృష్ణ, ఔరా అమ్మకుచెల్ల అన్న పెద్ద పదానికి పల్లె రాగం కట్టిన మాధవుడు, ఊపిరితో వేణువూదిన హరి, గర్వం ప్రతిభకు ప్రతిబంధకమని చెప్పిన అనంతరాముడు, సంగీతం అజరామరం అని రుజువు చేసిన శంకరశాస్త్రి.. ఇలా ఆయన సృష్టించిన పాత్రలు తెలుగువారితో శాశ్వతంగా ఉండిపోయే వరం పొందాయి. అలా కాశీనాథుని విశ్వనాథ్ అనే పేరు చిరంజీవిగా నిలిచిపోయింది. ఈ మహా దర్శకుడితో సిక్కోలు వాసులకూ పరిచయం ఉంది. కళా తపస్వి మహాభినిష్క్రమణం వేళ ఆ జ్ఞాపకాలు పంచుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆయనతోనే నా కళా జీవితం ప్రారంభం

కె.విశ్వనాథ్ సినిమా ఇండస్ట్రీలో ఒక గొప్ప డైరెక్టర్. ఆయన తెలుగు వారు కావడం మనకు గర్వకారణం. ఆయనకు పద్మశ్రీ ఇవ్వడం కాదు. భారతరత్నకు అర్హులు. విశ్వనాథ్‌గారితోనే నా కళాజీవితం ప్రారంభమైంది. 1980, ఆగస్టు 21న హైదరాబాదులో నా అరంగేట్ర సభకు ముఖ్య అతిథిగా వచ్చి నన్ను అభినందించారు. అప్పుడే శంకరాభరణం సినిమా హిట్ అయిన సమయంలో చెన్నైలో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానించాం. హైదరాబాద్‌లో ఆయన మా ఇంటి పక్కనే జూబ్లీహిల్స్‌లో ఉండేవారు. నా అరంగేట్రానికి వచ్చిన ఆయన సప్తపది సినిమాకు నన్ను ఎంపిక చేసేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఫొటోలో చూసి చాలా చిన్నగా ఉండడం వల్ల ఆ అవకాశం నాకు దక్కలేదు. ఆ తర్వాత స్వరాభిషేకం సినిమాలో శ్రీకాంత్, లయపైన ఒక పాట కోసం కొరియోగ్రఫీ కోసం అడిగారు. అయితే ఆ సమయంలో నాకు అమెరికా ప్రయాణం ఉండడం వల్ల ఆయనతో పని చేసే అవకాశం కలుగలేదు.



స్వాతీసోమనాథ్ అరంగ్రేటం సభలో విశ్వనాథ్‌తో స్వాతి

– స్వాతీ సోమనాథ్, డైరెక్టర్, సంప్రదాయ నాట్య గురుకులం

నా నాటకం చూసి నన్ను..

విశ్వనాథ్‌గారితో పరిచయం పెరిగిన తర్వాత మేము ప్రదర్శించిన పురుష సూక్తం నాటకం చూసి అభినందించారు. నేను హ్యాపీడేస్ సినిమాలో చేసిన తర్వాత ఆయనతో పరిచయం పెంచుకోవడానికి ఫోన్ నంబర్ తీసుకుని మాట్లాడాను. అప్పటికి ఆయన చెన్నైలో ఉండేవారు. ఆయన హైదరాబాదు వచ్చిన తర్వాత ఆయన ఇంటిలో ఒక సభ్యుడి మాదిరిగా మారిపోయాను. వారి ఇంటిలో ప్రతి ఫంక్షన్‌కు నన్ను పిలిచే వారు. శుభప్రదం సినిమాలో ఒక అవకాశం ఇవ్వాలని కోరగా.. నువ్వు హీరోవి కదా అంత పెద్ద పాత్ర లేదని అన్నా కూడా వదలకుండా కనీసం చిన్నపాత్ర ఇవ్వాలని కోరాను. ఆ సినిమాలో చిన్న పాత్రలో నటించాను. అయితే ఆయన 'శివాష్టపది' సినిమా నిర్మించాలనుకున్నారు. అందులో నన్ను తీసుకుంటారని ఎవరో చెప్పగా విన్నాను. కానీ ఆ సినిమా ప్రారంభం కాలేదు. ఒక సారి మా అమ్మ జన్మదిన వేడుకలకు బహుమతిగా ఆమెను విశ్వనాథ్, సిరివెన్నెల సీతారామశాస్త్రి ఇంటికి తీసుకువెళ్లాను. అది నాకు నిజంగా మిగిలిపోయిన జీవితకాలపు జ్ఞాపకం.



హీరో వంశీ కుటుంబ సభ్యులతో కళాతపస్వి

– వంశీ, హ్యాపీడేస్ హీరో

అభినందన మరువలేనిది

ఆయనతో నా అనుభవం అంటే ఒక సారి చెన్నై మ్యూజిక్ అకాడమీ ఆడిటోరియంలో 'వంద వసంతాల సినీ ఇంద్రధనస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చారు. నా ప్రదర్శనను తిలకించి నన్ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఇందులో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆశీర్వదించారు.

– శ్రీనివాస్, జాతీయ మిమిక్రీ కళాకారుడు




మిమిక్రీ శ్రీనివాస్‌ను చెన్నైలో సత్కరిస్తున్న విశ్వనాథ్

ఆయన పరిచయం ఒక జ్ఞాపకం

సంగీతం, నాట్యం వంటి కళల వైభవాన్ని పెంచిన మహోన్నత వ్యక్తి దర్శకుడు కె.విశ్వనాథ్. స్వరాభిషేకంలో కులకర్ణి పాత్ర నాకు దక్కాల్సి ఉండగా తృటిలో తప్పిపోయింది. టీవీకే శాస్త్రి సహకారంతో విశ్వనాథ్‌గారితో పరిచయం జరిగింది. ఆయన మాట్లాడే తీరు ఎంతో బాగుంటుంది.

– గురుగుబెల్లి లోకనాథం, రచయిత, విమర్శకులు, వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత



విశ్వనాథ్‌తో గురుగుబెల్లి లోకనాథం

పెళ్లికి హాజరు..



శ్రీకాకుళంలో పెళ్లికి హాజరైన విశ్వనాథ్

కళాతపస్వి కె.విశ్వనాథ్ 2007లో ఒక పెళ్లికి హాజరు కావడానికి శ్రీకాకుళం వచ్చారు. ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ కుమార్తె వివాహం సందర్భంగా పెళ్లికి హాజరు కావడానికి వచ్చి అతని స్నేహితుడైన జానకి రామారావు ఇంటి వద్దకు వచ్చారు. అలాగే 15 ఏళ్ల కిందట చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్.జానకితో సప్తపది చిత్రంలోని 'గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన' అనే గీతాన్ని ఆలపించగా చక్కగా పాడావని విశ్వనాథ్ తనను మెచ్చుకున్నారని సినీ గాయకుడు భారతి రమేష్ జ్ఞాపకం చేసుకున్నారు.

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 11న నిర్వహించనున్నామని, ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని న్యాయవాదులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు లోక్ అదాలత్‌కు సహకరించి కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. సివిల్ కేసుల్లో రాజీ అవడం వల్ల ఆస్తి తగాదాల్లో కుటుంబంలో బంధాలు గట్టిపడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎక్కువగా సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ కావడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురపు ఫల్గుణరావు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి అన్నెపు భువనేశ్వర రావు, గవర్నమెంట్ న్యాయవాది వినయ్ భూషణ్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ వెంకటరమణారావు పీవీ రమణ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

తుది సమరానికి సిద్ధం

- నేటితో ముగియనున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్
- సీనియర్స్ ఫైనల్స్‌కు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్, టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్-ఏ జట్లు
- జూనియర్స్‌లో ఫైనల్స్‌కు టెక్కలి ఐతమ్ పాలిటెక్నిక్, పలాస ప్రభుత్వ జూనియర్ కాలేజ్
- విజేతలకు బహుమతులు అందజేయనున్న స్పీకర్ తమ్మినేని

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ తుది తుది సమరానికి సిద్ధమైంది. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగియనుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. సీనియర్స్ విభాగంలో టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ (ఐతమ్)కాలేజ్-ఏ, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా, జూనియర్స్ విభాగంలో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐతమ్ పాలిటెక్నిక్ కాలేజ్ టెక్కలి జట్లు ఫైనల్స్‌లో అడుగు పెట్టాయి.

నేడు ముగింపు వేడుకలు..

ఐదు రోజులపాటు జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్ మెగా క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరగనుంది. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే ముగింపు, ట్రోఫీల బహూకరణ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఏ-గ్రౌండ్‌లో మ్యాచ్‌లు జరిగాయిలా..

సీనియర్స్ విభాగం:

క్వార్టర్స్‌లో ఆర్ట్స్ కళాశాల విజయం..

శ్రీకాకుళం ఆదిత్య డిగ్రీ కాలేజ్-ఏ జట్టుతో జరిగిన మూడో క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల 7 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేయగా, ప్రతిగా బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 3వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది.

క్వార్టర్స్‌లో సన్‌పై శివానీ గెలుపు..

అనంతరం శ్రీకాకుళం సన్ డిగ్రీ కాలేజ్‌తో జరిగిన నాలుగో క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ చిలకపాలెం జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన సన్ డిగ్రీ కాలేజ్ నిర్ణీత 8 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ చేసిన శివానీ జట్టు కెప్టెన్ దుప్పల కులశేఖర్ 31 పరుగులతో రాణించడంతో 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని నమోదు చేసింది.



భారీ షాట్‌కు ప్రయత్నిస్తున్న శ్రీశివానీ ఇంజనీరింగ్ కాలేజ్ జట్టు కెప్టెన్ డి.కులశేఖర్

నేటి ఫైనల్స్ మ్యాచ్‌లు ఇలా:

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఏ, బీ రెండు గ్రౌండ్‌లలో శనివారం రెండు ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు మొదలుకానున్నాయి. నిర్దేశిత సమయానికి మైదానం వద్ద ఆయా కళాశాలల జట్లు రిపోర్ట్ చేయాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

ఏ-గ్రౌండ్‌లో: (సీనియర్స్)

- ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల శ్రీకాకుళం - ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ (ఐతమ్)-ఏ టీం టెక్కలి జట్లు ఫైనల్స్ పోరులో తలపడనున్నాయి.

బి-గ్రౌండ్‌లో: (జూనియర్స్)

- పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల - టెక్కలి ఆదిత్య పాలిటెక్నిక్ (ఐతమ్) కాలేజ్ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో పోటీపడనున్నాయి.

బీ-గ్రౌండ్ మ్యాచ్‌ల తీరు ఇలా..

జూనియర్స్ విభాగం:

'ఐతమ్ పాలిటెక్నిక్' జయభేరి...

ఉదయం శ్రీకాకుళం శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజ్ శ్రీకాకుళంతో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఐతమ్ పాలిటెక్నిక్ కళాశాల టెక్కలి జట్టు 18 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ఐతమ్ పాలిటెక్నిక్ జట్టు, ప్రవీణ్ (41పరుగులు)రాణింపుతో నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 100 పరుగుల భారీ స్కోరు చేసింది. బదులుగా బరిలోకి దిగిన శ్రీ ఆదిత్య కాలేజ్ 82 పరుగులకే పరిమితమైంది. జట్టులో గోవింద్ 44 పరుగులతో ఒంటరిపోరాట చేసినా ప్రయోజనం లేకపోయింది.



సీనియర్స్ ఫైనల్స్‌లో ఆర్ట్స్ కాలేజ్



మధ్యాహ్నం ఏ-గ్రౌండ్‌లో శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజ్‌తో జరిగిన మొదటి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కాలేజ్ జట్టు 38 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌లో ప్రవేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆర్ట్స్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 97 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన రిమ్స్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 59 పరుగులకే పరిమితమైంది.

శివానీతో విజయంతో ఫైనల్స్‌కు ఐతమ్-ఏ..



మధ్యాహ్నం బీ-గ్రౌండ్‌లో శ్రీ శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ చిలకపాలెం జట్టుతో జరిగిన రెండో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ (ఐతమ్)-ఏ జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 91 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన ఐతమ్ ఇంజనీరింగ్ కాలేజ్-ఏ జట్టులో నాయుడు 45 పరుగులతో రాణించడంతో 7.5 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని నమోదు చేసింది.

జూనియర్స్ ఫైనల్స్‌లో పలాస..



అనంతరం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో జరిగిన మొదటి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్స్‌లో ప్రవేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 8 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 56 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన పలాస జీజే కాలేజ్ ఆటగాడు సాయి 30 పరుగులతో రాణించడంతో కేవలం 5.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది.

'ఐతమ్ పాలిటెక్నిక్' సైతం..



మధ్యాహ్నం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజ్‌తో జరిగిన రెండో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో ఆదిత్య (ఐతమ్) పాలిటెక్నిక్ కాలేజ్ టెక్కలి జట్టు 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించి ఫైనల్స్‌కు చేరింది. టాస్ గెలిచి బాట్యింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం బాయ్స్ కాలేజ్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 46 పరుగులు చేసింది. బదులుకు బరిలోకి దిగిన ఐతమ్ పాలిటెక్నిక్ కాలేజ్ కేవలం 5ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి విజయాన్ని నమోదుచేసింది.

క్లుప్తంగా

వృత్తి నైపుణ్య శిక్షణకు హెచ్‌ఎం విశ్వనాథం



ఎస్.విశ్వనాథం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణల్లో భాగంగా నాయకత్వ లక్షణాలు, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణకు ఇచ్ఛాపురం మండలం ధర్మపురం ఉన్నత పాఠశాలకు చెందిన శున్నాముద్ది విశ్వనాథం ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ నుంచి శుక్రవారం ఉత్తర్వు అందుకున్నారు. స్టేట్ కౌన్సిల్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎస్‌ఈఆర్‌టీ-అమరావతి) ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 10 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-అహ్మదాబాద్ (ఐఐఎంఏ) రీసెర్చ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్వనాథం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యత, విద్యార్థులకు అవసరమైన సామర్థ్యాలు, విద్యా సంస్కరణలు, కోర్సు డిజైన్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా నుంచి ఈయనతో పాటు బి.చిన్నాజీవర్మ(ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్-సోంపేట), మల్లారెడ్డి దేవరాణి(హెచ్‌ఎం-కొర్లకోట), నూక రామకృష్ణ(ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపాల్-కొల్లివలస), ఎ.సంజీవరావు(హెచ్‌ఎం, లోలుగు)లు శిక్షణకు హాజరకానున్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు సర్వే



పెద్దతామరాపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

నందిగాం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం కోసం ఏటా సామాజిక ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపగణాంకాధికారి దేసూళ సురేంద్ర తెలిపారు. శుక్రవారం నందిగాం మండలం పెద్దతామరాపల్లిలో సమగ్ర వార్షిక నిర్మాణ క్రమ సర్వే, ఆయుష్ ఆరోగ్యంపై సర్వే చేపట్టారు. డివిజినల్ ఉపగణాంకాధికారి పీసీ నందా, ఏఎస్ఓ ప్రశాంతిలతో కలిసి సర్వేలో పాల్గొన్న సురేంద్ర మాట్లాడుతూ ప్రజల జీవన విధానంపై ప్రతి సంవత్సరం సర్వే జరుగుతుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 20 శాంపిల్స్ సేకరించినట్లు చెప్పారు. మంచి నీరు, రోడ్లు, ఆస్పత్రి, రవాణా, వైద్యం, మొబైల్ నెట్‌వర్క్, కంప్యూటర్, టీవీ, శానిటేషన్ తదితర సౌకర్యాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పాతపట్నం: మండలంలోని బైరాగిపేటకు చెందిన వృద్ధురాలు సిరిపురం కాంతమ్మ(61) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. ఈ నెల 2న కాంతమ్మ పెద్ద కుమారుడు నూతన ఇంటిలో గృహప్రవేశం నిర్వహించగా.. ఇంట్లో దీపం కాంతమ్మ చీరకు అంటుకుని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శరీరం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త ప్రకాశరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గార వైస్ ఎంపీపీగా అంధవరపు రామలక్ష్మి



అంధవరపు రామలక్ష్మి

గార: గార మండల వైస్ ఎంపీపీగా శ్రీకూర్మం-1 ఎంపీటీసీ సభ్యురాలు అంధవరపు రామలక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టెక్కలి డీఎల్‌డీవో సి.అలివేలు మంగమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బీ ఫారాన్ని రామలక్ష్మీ పేరిట పార్టీ అందజేసింది. రామచంద్రాపురం ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు రామలక్ష్మి పేరును ప్రతిపాదించగా.. తూలుగు ఎంపీటీసీ సభ్యురాలు భైరి ప్రమీల బలపరిచారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో రామలక్ష్మిని వైస్ ఎంపీపీగా ప్రకటించారు. అనంతరం ప్రమాణస్వీకారం చేయించారు. వైస్ ఎంపీపీ బరాటం రామశేషు మృతి నేపథ్యంలో ఈ ఎన్నిక నిర్వహించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, వైస్ ఎంపీపీ అరవల శార్వాణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస శ్రీహరిరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, పీస గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి: ఎస్పీ

ఎచ్చెర్ల క్యాంపస్:

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది నుంచి వృత్తి పరమైన, వ్యక్తిగత సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు కీలకమని, వీరి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒత్తిడిని ఎదుర్కోవడానికి యోగా, ధ్యానం, వాకింగ్, రన్నింగ్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెలవు రోజుల్లో కుటుంబంతో గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ ప్రసాద్‌రావు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ విఠల్ రావు(ఫైల్)

గోపాలపట్నం: విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కంచరాన విఠల్‌రావు(35) మృతి చెందారు. ఎయిర్ పోర్టు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం గోకర్లపల్లికి చెందిన విఠల్‌రావు కానిస్టేబుల్. ప్రస్తుతం మాధవధార కళింగనగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అతని భార్య పురుడు కోసం పుట్టింటికి వెళ్లారు. గాజువాక ట్రాఫిక్ విభాగంలో ఆయనకు పోస్టింగ్ కాగా.. అనారోగ్య కారణాలతో కంట్రోల్ రూమ్ నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రాత్రి పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు పూర్తి చేసి ఇంటికి వచ్చారు. శుక్రవారం నగరంలో పలు పనులు నిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు డీమార్ట్ వద్ద హైవే దాటుతుండగా.. ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు అతివేగంగా వెళ్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని శరీరం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. విఠల్‌రావు మృతితో అతని కుటుంబంతో విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్న సన్యాసిరావు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే ధ్యేయం



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధ

కోటబొమ్మాళి: జిల్లాలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అనురాధ తెలిపారు. శుక్రవారం కోటబొమ్మాళి బీసీ వసతి గృహంలో జిల్లాలోని 16 బీసీ హాస్టల్స్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునఃశ్చరణ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులను చదివించాలన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, ఉర్లాం, నిమ్మాడ, నరసన్నపేట, తిలారు, కురుడు, జలుమూరు, నరసన్నపేట, శ్రీముఖలింగం, పాతపట్నం, బోరుభద్ర, పోలవరం బీసీ హాస్టల్స్‌కు చెందిన 250 మంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ టి.త్రినాథరావు, వార్డెన్లు ఎస్.ఆనందరావు, కురిటి లక్ష్మణరావు, డి.రామారావు, శ్రీనివాసరావు, శివప్రసాద్, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

5న సెక్యూరిటీ గార్డుల ఎంపిక

టెక్కలి: రక్ష, కైరోస్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డుల ఎంపిక కోసం ఈ నెల 5న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు, టెన్త్(పాస్/ఫెయిల్) చదివి నిర్దిష్ట ఎత్తు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు హాజరుకావచ్చని తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	54,930-00
బంగారం(22కె. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఆదుకున్న వైఎస్సార్ బీమా



బీమా నగదు అందిస్తున్న దృశ్యం

మందస: తండ్రి చింతాడ విష్ణుమూర్తి మూడేళ్ల క్రితం మరణించాడు. తల్లి పుష్పాంజలి కాయకష్టం చేసి, పిల్లల్ని చదివిస్తోంది. ఆమె కూడా పొలంలో కూలి పని చేసుకుంటున్న సమయంలో పిడుగుపాటుకు బలైంది. దీంతో కుమారులు దినేష్, కిరణ్‌కుమార్ అనాథలయ్యారు. ఈ తరుణంలో వైఎస్సార్ బీమా పథకం ఆదుకుంది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, సర్పంచ్ చింతాడ సుధ ప్రత్యేక కృషితో ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని శుక్రవారం సర్పంచ్ సుధా, చింతాడ గణపతి చేతుల మీదుగా దినేష్, కిరణ్‌లకు అందజేశారు. తమకూ ఎవరూలేరని బాధపడుతున్న సమయంలో ప్రభుత్వం ఆదుకోవడంతో పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చింతాడ చలపతి, సచివాలయం సిబ్బంది శ్రీదేవి, అమృత, భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు రట్టి లింగయ్య, మట్ట షణ్ముఖరావు, అన్నెపు సతీష్, చింతాడ శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

- ఆత్మవిశ్వాసమే ఉత్తమ వైద్యం
- క్యాన్సర్‌కు అందుబాటులో అధునాతన చికిత్స
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

విజయనగరం ఫోర్ట్:

మానవుని జీవని శైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాప్తి తీవ్రమవుతోంది. పూర్వీకులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో అతి తక్కువ మందే వ్యాధి బారిన పడేవారు. కానీ నేడు పాశ్చాత్య పోకడలకు పోయి పిజ్జాలు, బర్గర్లు వంటివి అధికంగా తినడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నారు. శనివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

గతంతో పోల్చితే క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గ్రామాల్లో అవగాహన లేక గతంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేవారుకాదు. దీంతో రోగులు ఏవ్యాధితో చనిపోయేవారో తెలిసేది కాదు. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో ఏచిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స చేయించుకోవాలనే ఆలోచన వస్తోంది. క్యాన్సర్ స్క్రీనింగ్ పెరగడం వల్ల వ్యాధి ఎంతమందికి ఉందో తెలుస్తోంది. చాలా మంది క్యాన్సర్ అనగానే భయందోళన చెందుతారు. ఆ భయంతో త్వరగా చనిపోతున్నారు. క్యాన్సర్ వచ్చినా భయపడాల్సిన పని లేదని, ప్రాణాంతకమైన వ్యాధిని అయినా ఆత్మవిశ్వాసంతో జయించవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నారు.

క్యాన్సర్ నియంత్రణకు ఎన్నో చికిత్సలు



దేశంలో ప్రతి 15 మందిలో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటోంది. చాలా మంది అవగాహన లేక త్వరగా గుర్తించక క్యాన్సర్ బారిన పడుతున్నారు. దశలను బట్టి చికిత్సలు ఉంటాయి. కొన్ని దశల్లో రెండు రకాల చికిత్సలు ఉంటాయి.చికిత్స జరిగిన తర్వాత రెండేళ్ల పాటు రెండు నెలలకు ఒకసారి, మూడేళ్ల తర్వాత మూడు నెలలకు ఒకసారి. ఐదేళ్ల తర్వాత ఐదు నెలలకు ఒకసారి వైద్యుడిని సంప్రదించాలి.

డాక్టర్ బి.రవిశంకర్, క్యాన్సర్ వైద్య నిపుణుడు